సిరీస్ సమం

చివరి టీ20లో భారత్ ఘన విజయం • మెరిసిన పూజా, రాధ

చెన్నై: దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 1-1తో సమం చేసింది. గత రెండు మ్యాచ్‌లలో విఫలమైన భారత బౌలర్లు కీలక పోరులో సత్తా చాటడంతో ఈ పర్యటనను దక్షిణాఫ్రికా ఓటమితో ముగించింది. పూజా వస్త్రకార్ (4/13), రాధా యాదవ్ (3/6) ధాటికి మొదట బ్యాటింగ్ చేసిన సఫారీలు 17.1 ఓవర్లలో 84 పరుగులకే ఆలౌట్ అయింది. ఆ జట్టులో బ్రిట్స్ (20) టాప్‌స్కోరర్. ఆ జట్టులో బ్రిట్స్‌తో పాటు అన్నెకె (17), కాప్ (10) మినహా మిగిలినవారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అరుంధతి రెడ్డి (1/14), దీప్తి శర్మ (1/21) రాణించారు. స్వల్ప ఛేదనను భారత్ అలవోకగా పూర్తిచేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన (40 బంతుల్లో 54 నాటౌట్, 8 ఫోర్లు, 2 సిక్సర్లు), షఫాలీ వర్మ (25 బంతుల్లో 27 నాటౌట్, 3 సిక్సర్లు) వికెట్ నష్టపోకుండా గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశారు. షఫాలీ తన శైలికి విరుద్ధంగా నెమ్మదిగా ఆడినా తొలి ఓవర్లోనే రెండు ఫోర్లు కొట్టిన మంధాన ఆ తర్వాత అదే జోరును కొనసాగించింది. డీ క్లర్క్ 11వ ఓవర్లో రెండు ఫోర్లు, ఓ సిక్సర్ సాధించి అర్ధ సెంచరీతో పాటు మ్యాచ్ విజయాన్ని ఖాయం చేసింది.

సంక్షిప్త స్కోర్లు

దక్షిణాఫ్రికా: 17.1 ఓవర్లలో 84 ఆలౌట్(బ్రిట్స్ 20, బాచ్ 17, వస్త్రాకర్ 4/13, రాధ 3/6), **భారత్:** 10.5 ఓవర్లలో 88/0(మంధాన 54 నాటౌట్, షెఫాలీ 27 నాటౌట్)

సిన్నర్‌కు షాక్

క్వార్టర్స్‌లోనే నిష్క్రమణ • సెమీస్‌కు మెద్వెదెవ్

లండన్: వింబుల్డన్‌లో మరో సంచలనం! టైటిల్ ఫేవరేట్లలో ఒకడైన ప్రపంచ మొదటి ర్యాంకర్ జన్నిక్ సిన్నర్ (ఇటలీ) ఈ టోర్నీ క్వార్టర్స్‌లోనే నిష్క్రమించాడు. మంగళవారం సెంటర్ కోర్టు వేదికగా జరిగిన క్వార్టర్స్‌లో ఒకటో సీడ్ సిన్నర్ 7-6 (9/7), 4-6, 6-7 (4/7), 6-2, 3-6తో డేనిల్ మెద్వెదెవ్ (రష్యా) చేతిలో ఓడాడు. సుమారు 4 గంటల పాటు 5 సెట్లలో హోరాహోరీగా పోరాడినా ఇటలీ కుర్రాడికి ఓటమి తప్పలేదు. పురుషుల ప్రిక్వార్టర్స్‌లో సెర్బియన్ స్టార్ నోవాక్ జొకోవిచ్ 6-3, 6-4, 6-2తో హోల్గర్ రునె (డెన్మార్క్)ను వరుస సెట్లలో ఓడించి ఈ టోర్నీలో 15వ సారి క్వార్టర్స్ చేరాడు. మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో వెకిచ్ 5-7, 6-4, 6-1తో సున్‌ను ఓడించి వింబుల్డన్‌లో తొలిసారి సెమీస్‌కు అర్హత సాధించింది.

కోహ్లీ పబ్‌పై కేసు

బెంగళూరు: టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీకి చెందిన పబ్‌పై బెంగళూరులో కేసు నమోదైంది. నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు పబ్ నడుపడంపై బెంగళూరు పోలీసులు చర్యలకు దిగారు. చిన్నస్వామి స్టేడియం దగ్గర్లో ఉన్న కోహ్లీ పబ్ 'వన్8 కమ్యూన్' నిర్వాహకులపై స్థానిక పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిబంధనల ప్రకారం నగరంలో అర్ధరాత్రి 1 వరకు అనుమతి ఉన్నా..ఎక్కువసేపు పబ్ తెరిచి ఉంచిన కారణంగా చర్యలు తీసుకున్నామని సెంట్రల్ డీసీపీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'అర్ధరాత్రి సమయంలో పబ్ నుంచి విపరీతమైన సౌండ్లు వస్తున్నాయన్న ఫిర్యాదు మేరకు చర్యలకు దిగాం. దర్యాప్తు కొనసాగుతున్నది. తదుపరి చర్యలు తీసుకుంటాం' అని పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. స్టార్ క్రికెటర్‌గా వెలుగొందుతున్న కోహ్లీ..ప్రముఖ నగరాలైన ఢిల్లీ, ముంబై, పుణె, కోల్‌కతా, బెంగళూరులో పబ్‌లు నిర్వహిస్తున్నాడు.

మహిళా అథ్లెట్లను గుర్తించం

• తాలిబన్ల హుకుం

కాబూల్: మహిళా స్వేచ్ఛ, సమానత్వంపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలనెదుర్కొంటున్నా అఫ్గానిస్థాన్‌ను ఏలుతున్న తాలిబన్లు మాత్రం తాము అనుసరిస్తున్న విధానాలపై వెనక్కి తగ్గేది లేదని మరోసారి స్పష్టం చేశారు. త్వరలో మొదలుకాబోయే పారిస్ ఒలింపిక్స్‌లో తమ దేశం నుంచి పోటీపడుతున్న వారిలో పురుష క్రీడాకారులనే గుర్తిస్తామని, మహిళా అథ్లెట్లను గుర్తించబోమని ఆ దేశ స్పోర్ట్స్ డైరక్టరేట్ ప్రతినిధి అటల్ మశ్వానీ తెలిపాడు. 'అఫ్గానిస్థాన్ నుంచి ముగ్గురు అథ్లెట్లు (పురుషులు) మాత్రమే ఒలింపిక్స్ బరిలో నిలిచారు. ప్రస్తుతం మా దేశంలో మహిళల క్రీడలను ఆపేశాం' అని ప్రశ్నించాడు.

మా వాళ్లు తాగలేదు

• శ్రీలంక క్రికెట్ బోర్డు వివరణ

కొలంబో: ఇటీవలే ముగిసిన పొట్టి ప్రపంచకప్ సందర్భంగా న్యూయార్క్‌లోని టీమ్‌హోటల్ ముందు శ్రీలంక క్రికెటర్లు 'మందుపార్టీ' చేసుకున్నారని వస్తున్న వార్తలపై ఆ దేశ క్రికెట్ బోర్డు వివరణ ఇచ్చింది. 'జూన్ 3న న్యూయార్క్ వేదికగా దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌కు ముందు మందుపార్టీ చేసుకున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవం. ఆటగాళ్లు తాగారని చెప్పడానికి ఒక్క ఆధారమూ లేదు' అని పేర్కొంది.

భారత కోచ్‌గా గంభీర్

బీసీసీఐ అధికారిక ప్రకటన • శ్రీలంక సిరీస్‌తో బాధ్యతల స్వీకరణ

ముంబై: భారత క్రికెట్‌లో గౌతం గంభీర్ శకం మొదలైంది. జాతీయ పురుషుల సీనియర్ క్రికెట్ జట్టుకు ప్రధాన కోచ్‌గా గంభీర్‌ను నియమిస్తున్నట్టు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మంగళవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపింది. ఇటీవలే ముగిసిన టీ20 ప్రపంచకప్‌తో మాజీ కోచ్ రాహుల్ ద్రావిడ్ పదవీకాలం ముగియడంతో గంభీర్‌కు ఆ బాధ్యతలను అప్పగిస్తున్నట్టు అందులో పేర్కొంది. అశోక్ మల్హోత్రా ఆధ్వర్యంలోని అడ్వైజరీ కమిటీ సూచన మేరకు గంభీర్‌ను ద్రావిడ్ వారసుడిగా ప్రకటించింది. వాస్తవానికి ఐపీఎల్-17 ఫైనల్ ముగిసిన వెంటనే హెడ్‌కోచ్ రేసులో గంభీర్ పేరు ప్రధానంగా వినిపించినా జీతభత్యాలు, సహాయక కోచింగ్ సిబ్బంది, ఇతర అంశాలపై చర్చలతో అధికారిక ప్రకటన ఆలస్యమైనట్టు బోర్డు వర్గాల సమాచారం. ద్రావిడ్ హయాంలో భారత జట్టు మూడు ఫార్మాట్లలోనూ అప్రతిహత విజయాలతో ప్రపంచ క్రికెట్‌ను శాసించిందని, ఆ వారసత్వాన్ని గంభీర్ మరింత ముందుకు తీసుకెళ్తాడని బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా అన్నారు. ఇక ప్రధాన కోచ్‌గా నియమితుడైన గంభీర్‌కు మొదటి పరీక్ష ఈ నెల 27 నుంచి శ్రీలంకతో జరుగబోయే పరిమిత ఓవర్ల సిరీస్‌తో మొదలవనుంది. 2004 నుంచి 2016 దాకా టీమ్ ఇండియాకు 58 టెస్టులు, 147 వన్డేలు, 37 టీ20లలో ప్రాతినిధ్యం వహించిన గంభీర్.. భారత జట్టు 2007లో గెలిచిన టీ20 ప్రపంచకప్, 2011లో నెగ్గిన వన్డే వరల్డ్ కప్ విజయాలలో కీలకపాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)కు సారథిగా 2012, 2014లలో ట్రోఫీని అందించాడు. ఆటగాడిగా క్రికెట్‌కు వీడ్కోలు పలికాక రాజకీయాల్లోకి వెళ్లిన గంభీర్.. గత ఎన్నికలలో వాటికి దూరంగా ఉన్నాడు. లక్నో సూపర్‌జెయింట్స్‌కు రెండేండ్ల పాటు మెంటార్‌గా వ్యవహరించిన గౌతీ.. ఈ ఏడాది మార్చి-మే మధ్య జరిగిన ఎడిషన్‌లో కేకేఆర్‌కు మెంటార్‌గా వచ్చి పదేండ్ల తర్వాత కోల్‌కతాకు ట్రోఫీని అందించడంలో సఫలీకృతుడై బీసీసీఐ దృష్టిలో పడ్డాడు. రానున్న రోజుల్లో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ, వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ వంటి కీలక టోర్నీలున్న నేపథ్యంలో 'మెన్ ఇన్ బ్లూ'ను గంభీర్ ఏ మేరకు విజయవంతంగా నడిపిస్తాడనేది ఆసక్తికరం.

> 'భారతదేశమే నా గుర్తింపు. నా దేశానికి సేవ చేయడం గొప్ప అవకాశంగా భావిస్తున్నా. గతంలో నేను మరో క్యాప్ (రాజకీయాల్లోకి వెళ్లడాన్ని ఉద్దేశిస్తూ) ధరించినా మళ్లీ సొంతగూటికి రావడం సంతోషంగా ఉంది. నీలం రంగు జెర్సీ ధరించిన ఆటగాళ్లు 140 కోట్ల భారతీయుల ఆశలు మోస్తున్నారు. వాళ్ల కలల్ని నిజం చేస్తూ ప్రతి భారతీయుడు గర్వించేలా చేయడమే నా ముందున్న లక్ష్యం'
> – గౌతం గంభీర్

దూకుడు మంత్రం పనిచేసేనా?

భారత క్రికెట్‌లో కోహ్లీ కంటే మునుపే దూకుడుకు మారుపేరుగా నిలిచిన గంభీర్ మైదానం లోపల, వెలుపల అగ్రెసివ్‌గా ఉంటాడు. ముక్కుసూటిగా మాట్లాడే అతడి వ్యవహార శైలి కారణంగా గంభీర్ పలుమార్లు విమర్శలు సైతం ఎదుర్కున్నాడు. అయితే రోహిత్, కోహ్లీ, జడేజా వంటి దిగ్గజాలు కెరీర్ చరమాంకంలో ఉన్న దశలో వారి స్థానాలను భర్తీ చేసే యువ ఆటగాళ్లను తయారుచేయడం గంభీర్‌కు కత్తిమీద సామే.

శభాష్ సిరాజ్

యువ పేసర్‌కు సీఎం రేవంత్ అభినందన

ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలానికి ఆదేశం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో చారిత్రక విజయం సాధించిన భారత జట్టులో సభ్యుడైన హైదరాబాదీ స్పీడ్‌స్టర్ మహమ్మద్ సిరాజ్‌పై ప్రశంసల వర్షం కురుస్తూనే ఉన్నది. అంతర్జాతీయ వేదికపై రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేసిన సిరాజ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. మంగళవారం ముఖ్యమంత్రిని సిరాజ్ ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా సిరాజ్‌ను సీఎం ఘనంగా సన్మానించారు. 'అంతర్జాతీయ క్రికెట్‌లో అతను అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు. ప్రస్తుతం అత్యున్నత క్రికెటర్ల సరసన సిరాజ్ నిలిచాడు' అని ప్రశంసించాడు. ఇదిలా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉద్యోగంతో పాటు ఇంటి స్థలం కేటాయించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ లేదా నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో అనువైన స్థలాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాల్సిందిగా సీఎం పేర్కొన్నారు.

కుర్రాళ్లకు అడ్డుందా?

జోరు మీదున్న టీమ్‌ఇండియా

జైస్వాల్, శాంసన్ రాకతో తుది జట్టు ఎంపికపై ఉత్కంఠ

జింబాబ్వేతో నేడు మూడో టీ20

హరారే: జింబాబ్వే పర్యటనకు వెళ్లిన టీమ్‌ఇండియా బుధవారం ఆతిథ్య జట్టుతో మూడో టీ20 ఆడనుంది. తొలి మ్యాచ్‌లో ఓడినా రెండో మ్యాచ్‌లో జింబాబ్వేను చిత్తుగా ఓడించి పుంజుకున్న యువ భారత్.. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా బుధవారం జరుగబోయే మూడో పోరునూ గెలుచుకుని సిరీస్‌లో ముందంజ వేయాలని భావిస్తోంది. జింబాబ్వేతో పోల్చితే అన్ని విభాగాల్లో పటిష్టంగా ఉన్న భారత్‌కు సంజూ శాంసన్, యశస్వి జైస్వాల్, శివమ్ దూబే రాకతో తుది జట్టులో ఎవర్ని తప్పిస్తారని ఆసక్తికరంగా మారింది.

జైస్వాల్ వస్తే తప్పుకునేదెవరు?

ఆలస్యంగా జింబాబ్వేకు వెళ్లిన జైస్వాల్, శాంసన్, దూబే రాకతో గిల్‌కు కొత్త తలనొప్పి ఎదురైంది. జైస్వాల్ రావడంతో గిల్‌తో జతగా ఓపెనర్‌గా ఎవరు వస్తారనేది ఆసక్తికరం. ఆడిన తొలి మ్యాచ్‌లో విఫలమైనా రెండో మ్యాచ్‌తోనే భారీ శతకం బాదిన అభిషేక్ శర్మను తప్పించే సాహసం అయితే గిల్ చేయకపోవచ్చు. ఇద్దర్నీ ఆడించాల్సి వస్తే వారు ఏ స్థానాల్లో బ్యాటింగ్ వస్తారనేది చూడాలి. వికెట్ కీపర్ జురెల్ స్థానంలో సీనియర్ ప్లేయర్ శాంసన్ తుది జట్టులోకి వచ్చే అవకాశాలున్నాయి. పరాగ్ స్థానాన్ని దూబే భర్తీ చేయొచ్చు. గత రెండు మ్యాచ్‌లలోనూ అదరగొట్టడంతో బౌలింగ్ విభాగంలో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు.

జింబాబ్వే పుంజుకునేనా?

మొదటి టీ20లో పర్యాటక జట్టుకు అనూహ్య షాకిచ్చిన జింబాబ్వే రెండో మ్యాచ్‌లో అన్ని విభాగాల్లోనూ విఫలమైంది. బౌలర్లు ధారాళంగా పరుగులిచ్చుకోగా బ్యాటర్లూ చేతులెత్తేయడంతో ఆ జట్టు భారీ ఓటమిని మూటగట్టుకోవాల్సి వచ్చింది. కెప్టెన్ సికందర్ రజా భారీ ఇన్నింగ్స్ బాకీ ఉన్నాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.